
సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 6 । మార్చి । 2023



క్షణం.. ఆలోచించు!

విపరీతమైన పోటీతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోంది. ఆత్మవిశ్వాసంతో చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. 8లో▸



ఉమ్రాకు బయల్దేరిన యాత్రికులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రం నుంచి 35 మంది గల బృందం ఉమ్రా యాత్రకు ఆదివారం బయల్దేరారు. పట్టణంలోని ఈద్గా మైదానం నుంచి ఫ్లయింగ్ వింగ్స్ ఉమ్రా సంస్థ ద్వారా యాత్రికులను ప్రత్యేక వాహనంలో సాగనంపారు.అబ్దుల్ మన్నాన్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/21.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. మధ్యాహ్నం ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'నీట్' పీజీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. 86 మందికి గాను 81 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని సెంటర్ హెడ్ పున్నారావు, రిమ్స్ వైద్యాధికారులు లక్ష్మీపతి, సుమలత పర్యవేక్షించారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాభివృద్ధికి కృషి



నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

ఆదిలాబాద్: జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి వారిని జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వీజీఎస్ జ్యోతిష్వరన్, కోశాధికారిగా ఎస్ స్వామి, ఉపాధ్యక్షులుగా రాజేశ్, మహేశ్, నాందేవ్, సంయుక్త కార్యదర్శులుగా రాహుల్, అగార్కర్, దేవేంద్రిక, మజీద్, కార్యవర్గ సభ్యులుగా ప్రియాంకరెడ్డి, నవనీత్, నరసమ్మ, నవీన్, వంశీ, జంగుబాయి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జయపాల్, రిటర్నింగ్ అధికారిగా మహేశ్ వ్యవహరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి పార్థసారథి, పెటా టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ స్వామి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతు ఇవ్వాలి



మాట్లాడుతున్న గోవింద్ నరేశ్

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బీజేపీ మద్దతు ఇవ్వకపోతే ఆ పార్టీని తెలంగాణలో భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ పేర్కొన్నారు. మాదిగల సంగ్రామయాత్ర ఆదివారం ఇచ్చోడకు చేరుకుంది. ఈ సందర్భంగా మండలంలోని ఆడేగామ(కె)లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని 2014 ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ హామీ ఇచ్చి నేటికి తొమ్మిదేళ్లవుతుందన్నారు. వర్గీకరణ సాధనలో భాగంగా ఏప్రిల్ 4న హైదరాబాద్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి మాదిగ, ఉప కులాల వారు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్, రాష్ట్ర కార్యదర్శి ప్రణీత్, ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ స్వామి, అధ్యక్షుడు చిట్టి రవి, ఎంఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: భారత జాగృతి అధ్యక్షురాలు కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన ఆరోపణలను నిరసిస్తూ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం 'బండి' దిష్టిబొమ్మ దహనం చేశారు. పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, బండి సంజయ్ మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు స్వరూపరాణి, మమత, పర్వీన్, శంకర్ పాల్గొన్నారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

మళ్లీ జ్వరం

- దగ్గు, జలుబు, తలనొప్పి లక్షణాలు సైతం..
- జిల్లాలో పెరుగుతున్న 'వైరల్' కేసులు
- తాజాగా నలుగురికి కోవిడ్ నిర్ధారణ
- జ్వరపీడితులతో ఆస్పత్రులు కిటకిట

ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉండే అజీమ్ ఇటీవల జ్వరం బారిన పడ్డాడు. దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో పాటు నీరసంగా ఉండడంతో రిమ్స్‌లో చేరాడు. ఇంట్లో ఒకరి నుంచి మరొకరికి జ్వరం వస్తుందని చెబుతున్నాడు ఈయన. ఇతనొక్కడే కాదు.. జిల్లా వ్యాప్తంగా ఇటీవల జ్వరపీడితులు అధికమయ్యారు. రిమ్స్‌లోనూ వీరి తాకిడి పెరిగింది.

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: జిల్లాలో మళ్లీ వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. నలుగురిలో ఎవరిని అడిగినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు, జ్వరం ఉందనే చెబుతున్నారు. వారం, పదిహేను రోజులుగా జిల్లా వ్యాప్తంగా చాలా మంది మంచాన పడుతున్నట్లు తెలుస్తోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు జ్వరాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇవి కోవిడ్ లక్షణాలుగా ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. సర్కారుతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందడంతో కుటుంబ సభ్యులంతా జ్వరపీడితులుగా మారుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఈ వైరల్ ఫీవర్ కాస్త నిమోనియాగా మారి ఊపిరితిత్తులకు చేరడంతో వృద్ధులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారు. జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదం తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

భయపెడుతున్న ఇన్‌ఫ్లుయెంజా

ఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఫ్లూ జ్వరాలు నమోదవుతున్నాయని రిమ్స్ వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లుయెంజా(హెచ్3 ఎన్2) లక్షణాలు కలిగిన వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. జ్వర పీడితులు వారం దాటితే అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. దయాబెటిక్ రోగులు, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలున్నవారు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ వైరల్ జ్వరం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి నిమోనియాగా మారితే ప్రాణాపాయస్థితికి చేరుకుంటారని పేర్కొంటున్నారు.

మాస్కులు ధరించాల్సిందే..

వైరల్ జ్వరం ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతున్నాయని,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. స్వైన్‌ఫ్లూ లక్షణాలు, హెచ్3 ఎన్2 వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. విందులు, వినోదాలు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు ఒకరినుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మాస్కు ధరించడం వల్ల వైరస్‌ను అరికట్టవచ్చని పేర్కొంటున్నారు. తరచూ శానిటైజర్ వాడాలని సూచిస్తున్నారు.

మంచాన పడుతున్న జనం..

పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రస్తుతం ఏ ఇంట్లో చూసినా ఒకరిద్దరు జ్వర పీడితులుగా ఉంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. తీవ్రమైన జ్వరం, దగ్గు, ఒళ్ల నొప్పులు, తలనొప్పి కారణంగా నడవలేకపోతున్నారు. అయితే వారం రోజుల్లో మామూలు స్థితికి వస్తున్నారు. గత నెలలో జిల్లాలో స్వైన్‌ఫ్లూ కేసులు సైతం నమోదైన విషయం తెలిసిందే. 2011–12సంవత్సరంలో స్వైన్‌ఫ్లూ భయాందోళనకు గురిచేసిన విషయం విదితమే. తీవ్ర జ్వరం, స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఉన్నవారి నమూనాలను రిమ్స్ అధికారులు సేకరించి హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ప్రస్తుతమైతే జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రులు కిటకిట

స్వైన్‌ఫ్లూ, కోవిడ్ లక్షణాలతో పోలిన జ్వరాలు రావడంతో జనం ఆందోళనకు గురవుతున్నారు. చాలా మందిలో నీరసం, తలనొప్పి, ఒళ్లనొప్పులు, దగ్గు, జ్వరం, తలతిప్పడం, చాతినొప్పి, ఆయాసం లక్షణాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్‌లోనూ చేరుతున్నారు. ముఖ్యంగా పి ల్లల ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. దగ్గు, జ లుబు, జ్వరంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజులుగా రిమ్స్‌లో ఓపీతో పాటు ఇన్‌పేషెంట్ సంఖ్య కూడా పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు. శనివారం రిమ్స్‌లో కొంతమందికి పరీక్షలు నిర్వహించగా నలుగురికి కోవిడ్ నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. గతంతో పోల్చితే కోవిడ్ ప్రభా వం అంతగా లేనప్పటికీ లక్షణాలు ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. రిమ్స్‌లో ప్రస్తుతం 100 మంది వరకు జ్వరాలతో చికిత్స పొందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం జిల్లాలో వైరల్ ఫీవర్ ప్రభావం ఉంది. ఇన్‌ఫ్లుయెంజా లక్షణాలు కనిపిస్తున్నాయి. చాలా మందిలో దగ్గు, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో పాటు నీరసంగా ఉంటున్నారు. కోవిడ్ సమయంలో పాటించిన జాగ్రత్తలే మళ్లీ పాటించాలి. మాస్కు ధరించాలి. శానిటైజర్ వినియోగించాలి. జ్వర పీడితులు కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఆవిరి పట్టడం మంచిది. డయాబెటిస్, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. శుభకార్యాలకు వెళ్లినప్పుడు, నలుగురితో కలిసినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణ మార్పుల కారణంగా ఈ వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి.

– డాక్టర్ సందీప్ జాదవ్, పల్మనాలజిస్ట్, రిమ్స్

రాబడి తక్కువ.. ఖర్చులు ఎక్కువ

బోథ్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పడింది. ఈ జీపీకి రాబడితో పోల్చితే ఖర్చులు ఎక్కువగా ఉండడంతో నిర్వహణ భారంగా మారుతోంది. పంచాయతీకి నెలకు వచ్చే గ్రాంటు కేవలం రూ.52,117మాత్రమే. ఇందులో ట్రాక్టర్ కిస్తీకి రూ.20వేలు, డీజిల్‌కు నెలకు రూ.5వేలు, సర్వీసింగ్, ఇతర నిర్వహణకు రూ.3నుంచి 4వేల వరకు ఖర్చవుతున్నాయి. ఈ గ్రాంటు నుంచే ఇద్దరు కార్మికులకు రూ.17వేలు, కరెంటు బిల్లు రూ.12వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. దీంతో గ్రామాభివృద్ధికి నిధులు సరిపోవడం లేదని సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి చెబుతున్నాడు. ఈ ఒక్క జీపీనే కాదు.. జిల్లాలో చాలా వరకు కొత్త పంచాయతీల్లో ఇదే పరిస్థితి.



బోథ్ మండలంలో నూతనంగా ఏర్పడిన పిప్పల్‌ధరి గ్రామపంచాయతీ

- ఆర్థిక సమస్యల్లో చిన్న పంచాయతీలు
- నిధులు పెంచాలని సర్పంచుల వినతి

బోథ్: చిన్న పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులతో కొ ట్టుమిట్టాడుతున్నాయి. వాటి నెలవారీ ఖర్చులు త డిసి మోపడవుతున్నాయి. కార్యాలయ నిర్వహణ, పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టడం తలకుమించిన భారంగా మారుతున్నాయి. నిధులు సరిపోకపోవడంతో చాలా జీపీలు అభివృద్ధికి నోచుకో వడం లేదు. దీంతో గ్రామస్తులు నిలదీస్తున్నారని సర్పంచులు వాపోతున్నారు. వచ్చే నిధులు ట్రాక్టర్ ఈ ఎంఐ, నిర్వహణ, సిబ్బంది వేతనాలకు సరిపోవడం లేదని పలువురు సర్పంచులు పేర్కొంటున్నారు.

వెంటాడుతున్న ఆర్థిక భారం..

జిల్లాలో మొత్తం 468 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 223 కొత్తగా ఏర్పడ్డాయి. వీటిలో 500 జనాభా ఉన్న జీపీలే అధికంగా ఉన్నాయి. ప్రభుత్వం పంచాయతీలకు జనాభా ప్రాతిపాదికన నిధులు విడుదల చేస్తోంది. దీంతో చిన్న పంచాయతీలకు తక్కువగా వస్తున్నాయి. కొత్త జీపీలకు ఆదాయ వనరులు సరిగా లేకపోవడంతో పాటు క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, శానిటేషన్, ఇతర పనులు చేయాలని ఇటీవల అధికారులు ఒత్తిడి తెచ్చారు. దీంతో వనరులు లేక సర్పంచులు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. పన్నుల వసూళ్లు కూడా పూర్తిస్థాయిలో కావడం లేదు. నాలుగు నెలలకోసారి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు సైతం సరిగా రాకపోవడంతో సర్పంచులు అప్పు తెచ్చి నిర్వహణ చేపడున్నారు.

నిధులు పెంచాలంటూ..

చిన్న పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవడం లేదని పలువురు సర్పంచులు పేర్కొంటున్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన జీపీల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని తీర్చాలంటే నిధులు పెంచాలని అంటున్నారు. బిల్లులు రాకున్నా అప్పు తెచ్చి పనులు చేస్తున్నామని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధులు కేటాయిస్తే జీపీల అభివృద్ధి సాధ్యపడుతుందంటున్నారు.

మరిన్ని నిధులివ్వాలి



చిన్న పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే మరిన్ని నిధులు కేటాయించాలి. వచ్చిన నిధులు ట్రాక్టర్ ఈఎంఐ, పంచాయతీ నిర్వహణ, వర్కర్ల జీతాలు, కరెంటు బిల్లులకే అయిపోతున్నాయి. చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే, ఎంపీ కోటా కింద నిధులు కేటాయిస్తే బాగుంటుంది.

– బందారి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, పిప్పల్‌ధరి

మహిళల ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం

- కలెక్టర్ రాహుల్‌రాజ్



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంతో పాటు సమాజం సైతం ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8నుంచి ప్రారంభించనున్న ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఇందులో కలెక్టర్ పాల్గొన్నారు. ర్యాలీ ఐపీ స్టేడియం నుంచి బాబు జగ్జీవన్ రామ్ చౌక్, కలెక్టరేట్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వివేకానంద చౌక్, వినాయక్ చౌక్ మీదుగా డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 8న ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ కేంద్రాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, అడిషనల్ డీఎంహెచ్‌వో సాధన మనోహర్, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అధికారులు, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'సమగ్ర' ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



భోజారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ఎమ్మెల్యే జోగు రామన్న ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. అనంతరం సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా డి.రాధ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ దీప్తి, ప్రధాన కార్యదర్శిగా పడాల రవీందర్, కోశాధికారిగా ప్రశాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సుజాత్‌ఖాన్, నర్సయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే హక్కు సంజయ్‌కు లేదు..

సీఎం కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు బండి సంజయ్‌కు లేదని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. బండి సంజయ్ కరీంనగర్‌లో గ్రానైట్ గుట్టలను మింగేసి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు వస్తే కనీసం 20 మంది కూడా ఆ పార్టీలో చేరలేదని ఎద్దేవా చేశారు. ఇందులో రైతు బంధు సమితి చైర్మన్ రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్ ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణింపు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

ఆదిలాబాద్‌రూరల్: ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంకోలి గ్రామంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళల కోసం 33 శాతం రిజర్వేషన్ కేటాయించారని కానీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దానిని మరింత పెంచాల్సి అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి మాధవీకృష్ణ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు మంజుల, ప్రమీలాజైన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

- అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలమ్మ



జిల్లా అధ్యక్షురాలు రాధకు నియామక పత్రం అందజేస్తున్న నిర్మలమ్మ

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం (టీఎన్‌జీఓ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిణిలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇతర శాఖల పనులు అప్పగించవద్దన్నారు. 2017 నుంచి అందాల్సిన టీఏ, డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 14 సవరించి పెరిగిన ఎరియర్స్ చెల్లించాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.రాధ, కార్యదర్శిగా పి.సునంద, కోశాధికారిగా వందన, సహాయ కార్యదర్శిగా భువన, ఉపాధ్యక్షురాలిగా కె.కవిత, కార్యవర్గ సభ్యులుగా ప్రేమ, సుజాత, రాణి, కమల, శశికళ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు భిక్షపమ్మ, కన్వీనర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్‌చైన్‌గేట్: మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మైనార్టీ కమిషన్ సభ్యుడు మహమ్మద్ అత్తర్‌ఉల్లా అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన అతనికి బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల పట్ల సీఎం కేసీఆర్ ఎంతగానో శ్రద్ధ వహిస్తున్నారన్నారు. మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తాహిడ్‌ఉద్దీన్ రఫ్ఫు, సలీం, నాయకులు మహమ్మద్ రఫీ, సల్మాన్‌ఖాన్, షాదాబ్ అహ్మద్, షేక్ సైయిద్, తదితరులు పాల్గొన్నారు.

రంగయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



రంగయ్యను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం

ఆదిలాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్‌కేడ్ మారుమూల గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కె.రంగయ్యను పద్మశాలి సంఘం నాయకులు కొనియాడారు. జిల్లాకేంద్రంలో ఆయన్ను ఆదివారం సన్మానించారు. పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బేత రమేశ్ మాట్లాడారు. సమాజంలో సామాజిక రుగ్మతలను, దురాచారాలను అరికడుతూ డిజిటల్ క్లాసులతో సావరేకేడ్ గ్రామాన్ని, పల్లెలోని పాఠశాలలో రంగయ్య మౌలి క వసతులు కల్పించి చిన్నారులకు విద్యనందించారన్నారు. ఉపాధ్యాయులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్, సంతోష్, బీసీ వెల్ఫేర్ అధికారి శివకుమార్, పోప నాయకులు స్వామి, లలిత, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



కాలిపోతున్న ఇల్లు

బోథ్: మండల కేంద్రంలోని న్యూకాలనీలో రాథోడ్ సూర్యకళకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేశారు. అంతలోపు ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బీరువాలో ఉన్న నగదు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది. మండలంలో అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ లేదని, ప్రజాప్రతినిధులు కల్పించుకుని బోథ్‌లో ఫైర్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

సరస్వతి కెనాల్‌లో పడి యువకుడి మృతి



సాయి (ఫైల్)

నిర్మల్‌రూరల్: ప్రమాదవశాత్తు సరస్వతి కెనాల్‌లో పడి యువకుడు మృతిచెందాడు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. మండలంలోని న్యూపోచంపాడు గ్రామానికి చెందిన రేపని సాయి (20) పని కోసం శనివారం సాయికొట్ల(కే) శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం వద్దకు వెళ్లాడు. సాయంత్రం పక్కనే ఉన్న సరస్వతి కెనాల్ వద్దకు కాలకృత్యాల కోసం వెళ్లి గల్లంతయ్యాడు. ఆదివారం మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదవత్ పూర్ణచందర్‌నాయక్ ఆదివారం పూజలు చేశారు. అనంతరం వేద పండితుడు చక్రపాణి వాసుదేవాచార్యులు ఆయనకు తీర్థప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట నాయకులు మంతెన సత్యం, అన్నారపు అంజి, బక్కశెట్టి శ్రీనివాస్, సందారపు లక్ష్మణ్, ఒడ్డె నవీన్, ఆకుల సుమన్, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

క్షణం.. ఆలోచించు !



- విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి
- క్షణికావేశం.. బలవన్మరణాలతో తీరని విషాదం
- తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడిని దూరం చేయాలి
- మానసిక ధైర్యం అవసరమంటున్న నిపుణులు

మంచిర్యాలఅర్బన్/నేరడిగొండ: చదువు విషయంలో ఒత్తిడి, తోటి విద్యార్థులు ఏదో అన్నారని క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతూ కన్నవారికి తీరని శోకం మిగుల్చుతున్నారు పలువురు విద్యార్థులు. పోటీతత్వం పెరిగిపోవడం.. ఉత్తమ మార్కుల కోసం తల్లిదండ్రుల ఒత్తిడి ఓ వైపు.. కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి మరోవైపు వారి ప్రాణాలపైకి తెస్తోంది. పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోవడంతో జీవితంలోనూ ఫెయిల్ అయితానేమో భావన వారిలో ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి షురూ కానున్నాయి. పరీక్షలంటే భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో సానుకూల దృక్పథంతో చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చంటున్నారు నిపుణులు.

ప్రణాళికాబద్ధంగా చదివితే..

విద్యార్థులు పాఠ్యంశాలు అర్థం కాక మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. సమయానికి సిలబస్ మొత్తాన్ని చదువులేక..ఆందోళన చెందుతుంటారు. నిద్రలేమి రాత్రులు..గడపటమే కాకుండా సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం విద్యార్థుల్లో చూస్తుంటాం. ఇలాంటి పరిస్థితుల్లో సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం కష్టమేమి కాదంటున్నారు నిపుణులు. అర్థం కాని పాఠాలను క్షుణ్ణంగా రెండు, మూడు సార్లు చదవాలని సూచిస్తున్నారు. సందేహాలుంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను, తోటి స్నేహితుల సహకారం తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ఇతరులతో పోటీ పడడంతోనే విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నారు. చదువు విషయంలో ప్రణాళిక, సమయపాలన ముఖ్యం. కష్టమైన సబ్జెక్టు ఉంటే ప్రతిరోజు వారు చదివేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి. కష్టమని పక్కకు పెడితే పరీక్షల సమయానికి ఇబ్బంది తప్పదు. వారి మెదడుకు మేత వేయాలి. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలి. చదువుపై ప్రణాళికబద్ధమైన అలవాటు చేయాలి.

– మహ్మద్ సద్దాం, పీహెచ్‌సీ వైద్యాధికారి, నేరడిగొండ

ఒత్తిడి, మానసిక సమస్యల పరిష్కారంపై అవగాహన



పరీక్ష ఫలితంతో సంబంధం లేకుండా విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భరోసా కల్పించాలి. యోగా, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలి. విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలు పరిష్కరించుకునేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టెలీ-మానస్ పేరిట 14416 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్కూల్ మెంటల్ హెల్త్, నేషనల్ టూబాకో కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించేందుకు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శిక్షణ నిర్వహించాం. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఫిబ్రవరి 28 నుంచి కార్యక్రమం మొదలైంది. అందుబాటులో సైకియాట్రిస్టులు కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు తగిన పరిష్కారాలను సూచిస్తారు.

– డా.సునీల్ కుమార్, మానసిక వైద్యనిపుణులు, మంచిర్యాల

మానసిక ఉల్లాసానికి సమయం



విద్యార్థులు ఏరోజు పాఠశాలను ఆ రోజే చదువుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. తమపై తమకు నమ్మకం పెరగడానికి దోహదపడుతుంది. ఒక్కొక్కరిలో ఒక్కో స్థాయి సామర్థ్యం ఉంటుంది. అంతకుమించి ఆయా కళాశాలల యజమాన్యాలు, తల్లిదండ్రుల ఆశించడంతో ఒత్తిడికి గురవుతుంటారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ బోర్డు టైం టేబుల్ కాకుండా తరగతులు నిర్వహించడం ఒత్తిడికి లోనవుతున్నారు. ఆయా కళాశాలలు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి కూడా తగిన సమయం కేటాయించాలి. యోగా, సాయంత్రం వేళల్లో ఆటవిడుపు చేపట్టాలి. – లక్ష్మణ్‌రావు, అధ్యాపకుడు

మానసిక ధైర్యం చెప్పాలి



తల్లిదండ్రులు పిల్లలకు మానసిక ధైర్యం చెప్పకపోతే భవిష్యత్‌లో ఎదురయ్యే కఠిన పరీక్షలను ఎదుర్కోలేరు. విద్యార్థులు పరీక్షలంటే భయం పడాల్సిన అవసరం లేదు. మార్కులు జీవితానికి ప్రమాణికంగా కాకుండా వారిని ప్రోత్సహించే విధానాలు తెలుసుకుని మానసికంగా బలవంతుల్ని చేయాలి. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కరోనా తర్వాత పరీక్షలను సులభతరం చేసింది. ఒత్తిళ్లను దూరం చేసేలా చర్యలు చేపట్టింది. పదకొండు పేపర్లకు బదులుగా ఆరు పేపర్లుగా మార్చుతూ నిర్ణయం తీసుకుంది. పాఠ్యాంశాలు అర్థం చేసుకోని చదువుకోవాలి.

– ఎస్.వెంకటేశ్వర్లు డీఈవో

భయం వీడితే జయం



విద్యార్థులకు పరీక్షల సమయంలో సరైన నిద్ర అవసరం. రాత్రంతా పుస్తకాలతో కుస్తీ పట్టడంతో ప్రయోజనం తక్కువే. కనీసం ఆరు గంటల నిద్ర అవసరం. నిద్రపోకుండా చదవటం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఆరోగ్యం క్షీణిస్తోంది. పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు నీటిని ఎక్కువగా తాగాలి. ప్రతి సబ్జెక్టు క్షుణ్ణంగా చదవాలి. అవగాహనతో అర్థం చేసుకుంటూ చదవాలి. ఆత్మవిశ్వాసం, సమయపాలనతో పాటు ప్రణాళికబద్ధంగా చదవటం అలవర్చుకుంటే లక్ష్యాన్ని చేరుకోవటం సులువే.

– అంబాల సమ్మయ్య, కౌన్సెలింగ్, సైకాలజిస్టు

బాసరలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసా(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఫాల్గుణ శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించిన భక్తులు అమ్మవారి సన్నిధిలో తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు చేయించారు.

నకిలీ జిందా తెలిస్మాత్ అమ్మితే చర్యలు

ఖానాపూర్: పట్టణంలోని మెడికల్, కిరాణా దుకాణాల్లో ఎవరైన నకిలీ జిందా తెలిస్మాత్ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎస్సై రజనీకాంత్ తెలిపారు. హైదరాబాద్ నుంచి జిందా తెలిస్మాత్ కంపెనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని పలు దుకాణాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించామన్నారు. 59 నకిలీ జిందా తెలిస్మాత్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు. వినియోగదారులు నకిలీ, ఒరిజినల్ జిందా తెలిస్మాత్‌ను గుర్తించి కొనుగోలు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని బారేమోడి గ్రామానికి చెందిన యువకుడు మొహర్లే రాందాస్(22) ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై నల్లా వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బారేమోడికు చెందిన మొహర్లే శంకర్, కమలాబాయిలకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నవాడైన రాందాస్ కెరమెరి నుంచి బారేమోడికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్టార్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా 'గురుకుల' యూజీ సెట్



పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న సీవోఈ ప్రిన్సిపాల్ సైదులు, ఎస్సై రాజశేఖర్

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని డిగ్రీ కళాశాలల్లో ఆదివారం అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (యూజీ సెట్-2023) ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. మొత్తం 2,207 మందికి గాను 2,023 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మరో 184 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల హాజరు 91.66 శాతంగా నమోదైనట్లు గురుకులాల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ప్రకటించారు.

పరీక్ష కేంద్రాల వారీగా..

ఆదిలాబాద్ (సీవోఈ బాలికల గురుకుల కళాశాల) పరీక్ష కేంద్రంలో 490 మంది విద్యార్థులకుగాను 450 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. ఇచ్చోడ (బాలికల డిగ్రీ కళాశాల) పరీక్ష కేంద్రంలో 337 మందికి 303 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. మరో 34 మంది హాజరుకాలేదు. సిర్పూర్ (టి)(బాలికల గురుకుల కళాశాల) లో 333 మందికి 304 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 29 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. సిర్పూర్ (టి) (బాలుర గురుకుల కళాశాల)లో 347 మంది విద్యార్థులకు 315 మంది పరీక్ష రాశారు. మరో 32 మంది గైర్హాజరయ్యారు. బెల్లంపల్లి (సీవోఈ బాలుర గురుకుల కళాశాల)లో 219 మందికి 209 మంది పరీక్షకు హాజరయ్యారు.10 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. బెల్లంపల్లి (సంక్షేమ బాలికల గురుకుల కళాశాల)లో 481 మంది విద్యార్థులకు గాను 442 మంది పరీక్ష రాశారు. మిగిలిన 39 మంది విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షకు దూరంగా ఉండి పోయారు. యూజీ సెట్ పరీక్ష నిర్వహణను ఆర్‌సీవో స్వరూపరాణి పర్యవేక్షించారు. బెల్లంపల్లిలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంచిర్యాలలో రక్షా హోమ్ బుకింగ్స్ ప్రారంభం



రక్షా హోమ్ అపార్ట్‌మెంట్



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కైలాస్ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలో అన్నిహంగులతో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ రక్షా హోమ్స్‌ను ఆదివారం రక్షా కన్‌స్ట్రక్షన్స్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కైలాస్ శ్రీనివాస్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించి బుకింగ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో మొదటిసారిగా మంచిర్యాలలోని ఏసీసీలో రక్షా హోమ్స్‌ను నిర్మించామని తెలిపారు. 60 బ్లాక్‌లు నిర్మించగా, స్విమ్మింగ్‌పూల్, లేడీస్ జెంట్స్ క్లబ్, చిల్డ్రన్స్ పార్కు, ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేశామన్నారు. విశాలమైన వెయిటింగ్ హాల్, పార్కింగ్ స్థలాలు ఈ అపార్టుమెంట్‌కు ఉన్నాయన్నారు.

అడెల్లి ఆలయంలో భక్తుల సందడి



అదనపు కలెక్టర్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకుడు

సారంగపూర్: శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వీరి కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. సారంగపూర్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని అదనపు కలెక్టర్ రాంబాబు దంపతులు, బీఆర్‌ఎస్ నాయకుడు కూచాడి శ్రీహరిరావు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన అయన్ను ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మొక్కులు చెల్లించుకున్న ఉప సర్పంచులు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలోని మహా పోచమ్మ వద్ద మండల ఉప సర్పంచులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మోహన్, ప్రధాన కార్యదర్శి అశోక్, క్యాషియర్ శ్రీనివాస్, సభ్యులు విద్యాసాగర్‌రెడ్డి, ముత్యం, సురేశ్, ముత్తన్న, ధర్మన్న, రాజన్న, శ్రావణ్, లింగన్న, వెంకటేశ్, అశోక్, రమణ, లక్ష్మణ్, రహమాన్ ఉన్నారు.

ప్రాణం తీసిన మూలమలుపు

- బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



నిపుంగే కృష్ణకు సీపీఆర్ చేస్తున్న క్షతగాత్రుడు సునీల్

జైనథ్: మండలంలోని బెల్గాం సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న మూలమలుపు మృత్యుకూపంగా మారింది. గ్రామ సమీపంలోని వాగుపై నిర్మించిన బ్రిడ్జి మూలమలుపు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ నిండు ప్రాణం బలిగొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మాకోడ గ్రామానికి చెందిన నిపుంగే కృష్ణ(21) తన మిత్రుడు సునీల్‌తో కలిసి బైక్‌పై బేల వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా బెల్గాం మూల మలుపు వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా బైక్ అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డ్‌కు వెళ్లి ఢీకొనడంతో కృష్ణ తలకు గాయాలయ్యాయి. సునీల్ రోడ్డు కింద పడిపోయాడు.

సీపీఆర్ చేసినా నిలవని ప్రాణం

ప్రమాదంలో కింద పడిపోయిన సునీల్ వెంటనే తేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణ వద్దకు వెళ్లి వెంటనే సీపీఆర్ చేశాడు. గుండె వద్ద పంప్ చేస్తూ, స్పృహలోకి తెప్పించేందుకు ప్రయత్నించాడు. అప్పటికే స్థానికులు అక్కడికి చేరుకోవడంతో 108కి సమాచారం అందించారు. ఇద్దరిని 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. కృష్ణకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యన మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు నిపుంగే విజయ్, సువర్ణలు బోరున విలపించారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో గొప్ప స్థానానికి వెళ్తాడనుకుంటే, కానరాని కోకాలకు వెళ్లిపోయాడని కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా సీవోఈ సెట్

పరీక్ష కేంద్రాల వారీగా..

పరీక్ష కేంద్రం	అలాట్‌మెంట్‌విద్యార్థులు	హాజరు	గైర్హాజరు
ఆదిలాబాద్ (బాలికలు)	648	614	34
బోథ్ బాలికలు	648	612	36
ఇచ్చోడ (బాలురు)	312	295	17
ఇచ్చోడ డిగ్రీ కళాశాల	312	295	17
ఆసిఫాబాద్ (బాలురు)	528	487	41
సిర్పూర్(టి) (బాలురు)	511	483	28
సిర్పూర్(టి) (బాలికలు)	528	501	27
రెబ్బెన (బాలికలు)	159	148	11
బెల్లంపల్లి (సీవోఈ)	504	476	28
బెల్లంపల్లి (బాలికలు)	493	473	20
కాసిపేట (బాలురు)	379	356	23
లక్సెట్టిపేట (బాలికలు)	545	522	23
చెన్నూర్ (బాలికలు)	576	554	22
జైపూర్ (బాలురు)	576	549	27



కాసిపేట బాలుర పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో స్వరూపరాణి

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన సీవోఈ సెట్-2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 6,719 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 6,365 మంది హాజరై పరీక్ష రాశారు. మరో 354 మంది డుమ్మా కొట్టారు. మొత్తంగా విద్యార్థుల హాజరు 94.74 శాతంగా నమోదైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ప్రకటించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1 గంటతో ముగిసింది. ఉదయం 9 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి వచ్చారు. ఆయా కేంద్రాల ముఖద్వారం వద్ద వారిని పరిశీలించిన తర్వాత లోనికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ఆర్‌సీవో

బెల్లంపల్లిలోని కాసిపేట బాలుర గురుకుల కళాశాల, ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని రెబ్బెన పరీక్ష కేంద్రాలను ఆర్‌సీఓ స్వరూపరాణి పర్యవేక్షించారు. పరీక్షల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఎప్పటికప్పుడు ఆమె పర్యవేక్షించి చీఫ్ సూపరింటెండెంట్లకు మార్గదర్శకం చేశారు. బెల్లంపల్లి సీవోఈ కళాశాల, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, బాలికల గురుకుల కళాశాల పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, ఊటూరి సంతోష్, స్వరూపలు పటిష్ట చర్యలు తీసుకున్నారు. డిపార్ట్ మెంటల్ అధికారులుగా పూర్ణిమ, స్వప్న వ్యవహరించగా, రూట్ అధికారిగా కోటిచింతల మహేశ్వరరావు ఆనందరెడ్డి పనిచేశారు.

సారంగపూర్: జామ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో సీవోఈ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 455 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఇందులో 435 మంది హాజరు కాగా మరో 25 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తెలిపారు.